# పంట రక్షణకు పడరాని పాట్లు

శివ్వంపేట: పంటను కాపాడేందుకు బోరు తవ్వినా చుక్క నీరు పడలేదని చూపెడుతున్న షేక్ షరీఫోద్దిన్

చేగుంట: పాట్టదశకు వచ్చిన పంటకు ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతు చింతాకుల శ్రీనివాస్

చేగుంట: కర్నాల్‌పల్లిలో వరి పంటలో మేకలు, గొర్రెలను మెపుతున్న మహిళా రైతు మంజుల

నిజాంపేటలో భూగర్భ జలాలు అడుగంటడంతో నీరు అందక ఎండి పోయిన వరి పంట

- **రెండు బోర్లు ఎత్తిపోయే.. కొత్త బోర్లు 600 ఫీట్లు వేసినా చుక్క నీరు రాకపాయే: అన్నదాతల ఆవేదన**
- **వెయ్యి పెట్టి ట్యాంకర్ తెచ్చి పారపెడుతున్నా ఎండి పోతున్న పంట: రైతన్న ఆందోళన**

చేగుంట, మార్చి16: సాగు నీరందించి తమ పంటలు కాపాడాలని చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో రైతులు ఇటీవల చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. మల్లన్నసాగర్

చేగుంట: కర్నాల్‌పల్లిలో 600 ఫీట్లు వేసిన చుక్కనీరు రాకుండా బోరు నుంచి దుమ్మ వస్తున్న దృశ్యం

కాలువ ద్వారా తమ చెరువుకు నీరు చేరకుండా గొడుగుపల్లి, గొల్లపల్లి గ్రామాల రైతులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి నీరురాక పంటలు ఎండిపోతున్నాయని, ఏడెనిమిది వందల ఫీట్ల వరకు బోర్లు వేయించినా నీరు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రైతులు బోర్లు వేసి అప్పుల పాలైనట్లు చెబుతున్నారు. పొట్ట దశలో ఉన్న పంటను రక్షించుకునేందుకు వెయ్యి రూపాయలు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇంత చేస్తున్నా పంటలు గట్టెక్కుతాయనే నమ్మకం లేదు. ఎండిపోయిన పొలాలను పశువులు, జీవాలకు మేతగా మార్చేస్తున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. బీఆర్ఎస్ హయాంలో కాలువల ద్వారా వచ్చిన నీటితో చెరువులు నిండాయని, ఈసారి ఆ పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

### మళ్లీ బోరేస్తే చుక్క నీరు రాలే..

శివ్వంపేట, మార్చి 16: శివ్వంపేట మండలం గూడురు గ్రామానికి చెందిన రైతు షేక్ షరీఫోద్దిన్ ఎకరంన్నర పొలంలో ఉన్న బోరు వట్టిపోయింది. వరి పొట్టదశకు చేరడంతో తడులు లేక ఎండుముఖం పట్టింది. దీంతో పంటను ఎలాగైనా కాపాడుకోవాలని అప్పుచేసి మరీ ఆదివారం వేరే బోరు వేయించాడు. చుక్క నీరు పడలే. దీంతో ఆ రైతు కన్నీటిపర్యంతమయ్యాడు.

### బోర్లలో నీళ్లు ఇంకిపోయినయ్

పొలాలను కాపాడుకునేందుకు అనేక పాట్లు పడుతున్నాం. పాత బోరులో నీళ్లు ఇంకిపోతే మరొకటి కొత్తగా బోరేసిన. చుక్క నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నయ్. వరిని కాపాడుకోలేకపోతున్నం. మొక్కజొన్న ఇత్తులు పట్టె సమయంలో నీరు అందక ఎండిపోతున్నది. వ్యవసాయం వదిలి పెట్టి కూలి పనికి పోతున్న.

**- దుర్గయ్య, రైతు, నిజాంపేట**

### అడుగంటిన భుగర్భ జలాలు

నిజాంపేట్, మార్చి 16: వేసవి మొదలే కాలేదు అప్పుడే ఎండ తీవ్రత పెరగటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. రైతన్నలు పంటలను రక్షించుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. బోరు బావుల్లో నీరు రాక, మోటర్లు కాలిపోతున్నాయి. మళ్లీ బోరు లోతుగా తవ్వించినా చుక్క నీరు రాక పంటలను రక్షించుకోలేకపోతున్నారు.

**- మసూద్, మోటరు మెకానిక్, నిజాంపేట**

చేగుంట: భూగర్భజాలలు అడుగంటడంతో ఎండిపోయిన కర్నాల్‌పల్లి చెరువు

## యువత ఆర్మీలో చేరి దేశానికి సేవలందించాలి

మెదక్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): దేశానికి సేవలందించేందుకు యువతకు మంచి అవకామని, ఇండియన్ ఆర్మీలో చేరే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి సేవలందించేందుకు యువతకు పెద్ద సంఖ్యలో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ దోహదపడుతుందన్నారు. దీనిలో భాగంగా ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2025-26 కోసం ఈ నెల 12 నుంచి www.joinindianarmy.nic.in వెబ్ పోర్టల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆర్మీలో చేరడానికి ఆసక్తి గల అభ్యర్థులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, సికింద్రాబాద్ 040-27740059 సంప్రదించాలన్నారు.

### పిడమర్తి రవిని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలి

**మాదిగ జేఏసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు కర్రె రమేశ్**

రామాయంపేట రూరల్, మార్చి 16: రాష్ట్ర సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీలో అనేక ఉద్యమాలు చేసిన ఉద్యమకారుడు పిడమర్తి రవిని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని మాదిగ జేఏసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు కర్రె రమేశ్ డిమాండ్ చేశా రు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసుల పాలై ఉద్యోగాలను కూడా వదులుకుని త్యాగలు చేసిన పిడమర్తి రవికి చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించాలన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులకు సముచిత స్థానాలు కల్పించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ విధమైన స్థానం కల్పించాలని కోరారు.

### నేడు తైబజార్ వేలం

టేక్మాల్, మార్చి 16: టేక్మాల్ పంచాయతీలో మార్కెట్‌కు సంబంధించిన తైబజార్‌ను నేడు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో రాకేశ్‌కుమార్ తెలిపారు. మేకల బజార్, కూరగాయల మార్కెట్ పశువుల సంతకు వేలం జరగనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

### పుస్తెమట్టెలు అందజేత

నిజాంపేట,మార్చి16: వెంకటాపూర్(కె)కు చెందిన హంస గణేశ్ దంపతుల కూతురు వివాహం ఆదివారం జరిగింది. లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ హాజరై వధువుకు పుస్తెమట్టెలు అందజేశారు.

### సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

నిజాంపేట, మార్చి 16 : నిజాంపేటలోని 10 వ వార్డులో సీసీ డ్రైనేజీ పనులను మాజీ ఎంపీపీ సిద్ధిరాములు ఆదివారం ప్రారంభించారు. మురుగు నీరు ఆరుబయట ప్రవహించకుండా నివారించుటకు రూ.4.70 లక్షల వ్యయంతో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభించామని మాజీ ఎంపీపీ తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో ఆగిన అభివృద్ధి

**నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, మార్చి 16: కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుటుంపడిందని సంక్షేమ పథకాలు అమలుకావడం లేదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ నివాసంలో మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అమలుకానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. పెద్దశంకరంపేట మండలంలోని జంబికుంట, చీలపల్లి, ఆరెపల్లి, గోపని వెంకటాపూర్, కోళ్లపల్లి, భూర్గుపల్లి నుంచి దానంపల్లి, మాడ్చెట్‌పల్లి, వీరోజిపల్లి, శివయపల్లిచ కొత్తపేట, గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయించామన్నారు. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దళిత బంధులో పలువురికి మంజూరైన నిధులు కూడా ఇవ్వటం లేదన్నారు. ప్రభుత్వ పట్టాలు పొంది గృహలక్ష్మిలో మంజూరైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మాణిక్‌రెడ్డి, జంగం రాఘవులు, శంకర్‌గౌడ్, సుభాష్, రవీందర్, యాదూల్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

## ఈతకు నీట మునిగి వెళ్లి వ్యక్తి మృతి

లక్ష్మణ్ (ఫైల్)

కౌడిపల్లి, మార్చి 16: చెరువులో ఈతకు వెళ్లి ఊపిరాడక నీట మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొచ్చెర్వు తండా గూగులోత్ తండాలో ఆదివారం జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గూగులోత్ లక్ష్మణ్ (32) రోజు మాదిరి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తండా వాసులు ఇచ్చిన సమాచారం మేరకు ముండ్రాయి చెరువులో దిగి ఈత కొడుతున్న సమయంలో ఊపిరాడక నీట మునిగాడు. కుటుంబ సబ్యులు చెరువులో గాలించగా మృత దేహం లభ్యమైంది. మృతుడి భార్య సునీత తన భర్త మృతిపై అనుమానాలున్నాయని తెలిపింది. మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డిపై అనుమానం వ్యక్తం చూస్తూ ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నామోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థి జీవితానికి విద్య పునాది రాయి

స్నాతకోత్సవంలో విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 16: విద్యార్థి జీవితానికి విద్య పునాది రాయి లాంటిదని ఎడ్యుకేషనల్ ట్రైనర్ డాక్టర్ దీపదేశ్‌పాండే అన్నారు. జిల్లా కేంద్రంలోని సిద్దార్థ విద్యాసంస్థలో ఆదివారం స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ప్రీ ప్రైమరి విద్య విద్యార్థి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందన్నారు. సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి పాల్గొన్నారు.

## మల్కాపూర్ చెరువులోకి కాళేశ్వరం జలాలు

మల్కాపూర్ చెరువులోకి ప్రవహిస్తున్న కాళేశ్వరం జలాలు

తూప్రాన్, మార్చి 16: తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ చెరువులోకి కాళేశ్వరం జలాలను తరలిస్తున్నారు. గతంలో మల్లన్నసాగర్ ద్వారా కాళేశ్వరం జలాలు సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండల్ వడ్డెపల్లి వరకు తీసుకొచ్చారు. వడ్డెపల్లి నుంచి మల్కాపూర్ వరకు కాలువలు పూర్తి కాకపోవడంతో రైతులు తమ సొంత ఖర్చులతో కాలువలు పూర్తి చేసుకున్నారు. ఆదివారం నుంచి మల్కాపూర్ తుర్క చెరువులోకి కాళేశ్వరం జలాలు వస్తున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దీక్షాలో మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, మాజీ కౌన్సిలర్ యాదగిరి

## డంపింగ్‌యార్డు రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం

నర్సాపూర్, మార్చి 16: కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్‌యార్డును రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని 4వ వార్డు కౌన్సిలర్ యాదగిరి హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఆదివారం నాటికి 26వ రోజుకు చేరుకున్నది. నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మురళీయాదవ్ వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బుచ్చేశ్‌యాదవ్, రాజేందర్, దిగంబర్, రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యంతో ఆరోగ్యానికి భరోసా

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

వెల్దుర్తి, మార్చి 16: గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని మాసాయిపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నందిని రమేశ్ గాంధీ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీసీ షరాఫ్ దవాఖాన ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని నాయకులు సిద్ధిరాంలుగౌడ్, నాగరాజుల, మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. డాక్టర్లు సతీశ్‌చంద్ర, రూపేందర్, సుష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చేగుంట, మార్చి 16: చేగుంటకు చెందిన సపాయి కార్మికుడు ఎర్ర రమేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి అయిత పరంజ్యోతి ఆదివారం పరామర్శించి అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

### చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, మార్చి 16: చిన్నశంకరంపేటకు చెందిన మహ్మద్‌మైనుద్దీన్ తల్లి మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎన్నారై చంద్రశేఖర్ ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. రామాయపల్లికి చెందిన శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి లీలాగ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

## చిన్నపిల్లలతో డప్పుకొట్టించడం సిగ్గుచేటు

డప్పు కొడుతున్న విద్యార్థులు

శివ్వంపేట, మార్చి 16: శివ్వంపేటలో కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షపార్టీ బీఆర్ఎస్ నాయకులకు వ్యతిరేకంగా ఆదివారం ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో స్కూలుకు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులను తీసుకొచ్చి ఏకంగా కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవులరాజిరెడ్డి ముందు డప్పుకొట్టించారు. విద్యార్థుల నోట్లో డబ్బులు పెట్టి మరీ డప్పు కొట్టించడం గమనార్హం. డప్పుకొట్టిన వారిలో ఓ విద్యార్థి 8వ, మరో విద్యార్థి 10వ తరగతి చదువుతున్నారు. కాంగ్రెస్ నాయకులు స్కూలుకు వెళ్లే విధ్యార్థులను రాజకీయ కార్యక్రమానికి తీసురావడం తప్పని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ విమర్శించారు. ఇది బాలల హక్కుల ఉల్లంఘన అవుతుందని, విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతీసే చర్య అన్నారు.

## వివాహానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరు

కౌడిపల్లి, మార్చి 16: కౌడిపల్లి మండల కేంద్రంలో శ్రీలక్ష్మీ నర్సింహ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం చిలిపిచెడ్ మండలం రాందాసుపల్లి గ్రామానికి చెందిన అంకం కమలమ్మ, విఠల్ కుమారుడు కరుణాకర్, శ్రావణి వివాహానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట నాయకులు ముకుందారెడ్డి, బెస్త లక్ష్మణ్, అంకం యాదగిరి, కిశోర్‌గౌడ్, పోల నవీన్, రవి సాగర్ ఉన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

నిజాంపేట, మార్చి 16: రాంపూర్‌లో భూలక్ష్మీ చంద్రాగౌడ్ దంపతుల కుమారుడి వివాహం సోమవారం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మ్‌పర్సన్ లావణ్యారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నస్కల్, రాంపూర్ గ్రామాధ్యక్షులు దుర్గయ్య, యాదగిరి, మండల కో-అప్షన్ మాజీ సభ్యుడు గౌస్, నాయకులు దుబ్బరాజగౌడ్, నగేశ్‌యాదవ్, ఎల్లం, రంజిత్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, పరుశుగౌడ్,లింగంగౌడ్,యాదగౌడ్,శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## మెదక్ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 16: భక్తులతో మెదక్ చర్చి ఆదివారం కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు యేసయ్యకు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను ద్దేశించి చర్చి ప్రేసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశం వినిపించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువణ్ డగ్లస్, శాంశాన్ సందీప్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

రామాయంపేట, మార్చి 16: 2025-2028 కాలపరిమితికి జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలను తూప్రాన్ పట్టణంలోని దేవీ గార్డెన్‌లో ఈ నెల 18న నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి సోమయాజుల రవీంద్రశర్మ, సహాయ ఎన్నికల అధికారులు మధుశ్రీశర్మ, డీజీ. శ్రీనివాసశర్మ తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఆ రోజు జిల్లా సంఘంలో సభ్యత్వం ఉన్న వారు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట రూరల్, మార్చి 16: దామరచెర్వు గ్రామానికి చెందిన దండు అశోక్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన బీఆర్ఎస్ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5 వేలు మృతుడి అంత్యక్రియలకు బీఆర్ఎస్ నాయకులు నీల రాజు, కర్రొళ్ల నర్సింలు, తదితరుల ద్వారా అందజేశారు.

## 19 నుంచి దుర్గమ్మ, పోచమ్మ జాతర

టేక్మాల్, మార్చి 16: ఈ నెల 19 నుంచి టేక్మాల్‌లోని దుర్గమ్మ, పోచమ్మ దేవాలయాల జాతరలు వైభవంగా నిర్వహించనున్నారు. 19న బోనాలు, 20న బండ్ల ఊరేగింపు, 21న బండిషిడి, 22న రథోత్సవం, కుస్తీపోటీలు, 23న పాచిబండ్ల ఊరేగింపుతో జాతర ఉత్సవాలు ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉరేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

నందిని

రామాయంపేట రూరల్, మార్చి 16: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న అమ్మాయి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్ముల నందిని (25) హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నది. ఇటీవల ఇంటికి వచ్చిన నందిని ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. రామాయంపేట పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. నందిని ఆత్మహత్యకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

రవీందర్

రామాయంపేట, మార్చి 16: రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన ఒద్ది రవీందర్ (48) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. ఇటీవల కిడ్నీ ఆపరేషన్ జరిగింది. నెల రోజుల్లోనే బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హైదరాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.